క్లుప్తంగా

అపరాధయ్యస్వామి విగ్రహ పునఃప్రతిష్ట


అపరాధయ్యస్వామి బండను పునఃప్రతిష్టిస్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: అప్పరాచెరువు చెరువు సమీపంలో గుప్తనిధుల కోసం పెకిలించిన అపరాధయ్య స్వామి(బండను)ని గ్రామస్తులు శుక్రవారం పునఃప్రతిష్టించారు. వేదపండితుడు జయకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వీర నారప్ప, వెంకటరంగారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఆదెప్ప, పోతలయ్య, రామచంద్రతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు. గత నెల 18న గుర్తు తెలియని దుండగులు ఏకంగా జేసీబీతో గుప్తనిధులు కోసం అపరాధయ్య వెలసిన పెద్ద బండను తొలగించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదు.

ఓబులేశ్వరుని విగ్రహ ప్రతిష్ట

తలుపుల: ఓబులేశ్వరుని కొండపై వెలసిన ఓబులేశ్వరుని ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు గుజ్జు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితుడు లక్ష్మీ నరసింహస్వామి బృందం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఏఈఓగా మనోహర్ నాయక్

ముదిగుబ్బ: వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓగా మనోహర్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. దొరిగిల్లు సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్ష ఫీజు చెల్లింపు

కదిరి అర్బన్: కొండమనాయునిపాళెం, కే.బ్రాహ్మణపల్లి జెడ్పీ హైస్కూళ్ల టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజును హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ చెల్లించింది. ఈమేరకు శుక్రవారం 59 మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు కోసం రూ.7,375 చెక్కును విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ హెచ్ఎంలు శంకరబాబు, రఘునాథరెడ్డికి అందించారు. స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవి నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడిగా బొగ్గు నాగరాజు, ఉపాధ్యక్షులుగా అంకే పెద్దన్న, దాసరి సురేష్, కార్యదర్శులుగా జయకృష్ణ, బాబు, కోశాధికారిగా అనిల్‌కుమార్, కాటమయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన బస్సులు ప్రారంభం


బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం 5 నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. ప్రజలందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. కదిరి డిపో అభివృద్ధి కోసం కొన్ని ప్రతిపాదలతో కూడిన వినతిపత్రాన్ని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు అందజేశారు. కదిరి–శ్రీశైలం, కదిరి–మంత్రాలయం, కదిరి– చైన్నె, కదిరి– విజయవాడకు వోల్వో బస్సులు ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో డీఎం మైనోద్దీన్, ఈయూ రాష్ట్ర నాయకులు నబీరసూల్, జీవైపీ రావ్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, దివాకర్, సురేంద్ర, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ నిలదీత


ఎంపీడీఓను నిలదీస్తున్న గంగన్నగారిపల్లి చంద్రన్న కాలనీ లబ్ధిదారులు

కదిరి అర్బన్: తమకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని గంగన్నగారిపల్లిలో చంద్రన్న లే అవుట్ లబ్ధిదారులు ఎంపీడీఓ పోలప్పను నిలదీశారు. శుక్రవారం కాలనీలో మౌలిక వసతులు పరిశీలించేందుకు ఎంపీడీఓ, హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్, ఉపాధి హామీ అధికారులు వచ్చారు. కాలనీలో నీటి సౌకర్యం లేదని, ఇళ్లపై విద్యుత్ లైన్ వెళ్తోందని, నిర్మాణాలు చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. త్వరలో నీటి సౌకర్యం కల్పిస్తామని, విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరిస్తామని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

సచివాలయ సేవలు దూరం

- పింఛన్ల పంపిణీకి పరిమితమైన సచివాలయ ఉద్యోగులు
- ప్రభుత్వ సేవలు అందక గ్రామీణుల అవస్థలు
- ఆధార్ అప్డేట్ కోసం విద్యార్థుల ఇక్కట్లు


ప్రజలు, సిబ్బంది లేక వెలవెలబోతున్న ఎన్‌పీకుంట సచివాలయం

ఎన్‌పీకుంట: సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ వ్యవస్థకు తూట్లు పొడిచింది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను రూపుమాపిన చంద్రబాబు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వ్యవస్థలో సచివాలయాల ద్వారా సుమారు 500లకు పైగా సేవలు గ్రామీణులకు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు పూర్తి కావొస్తున్నా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీకార్డులకు సంబంధించి వెబ్‌సైట్లు ఇంత వరకు ఓపెన్ కాలేదు. ఫలితంగా అనేక మంది దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

గత ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన 2000 జనాభా ఉన్న పంచాయతీలకు రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో భారత్ నిర్మాణ్ సేవా (హెల్త్ సెంటర్) కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. సచివాలయాల ద్వారా ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1బీలు మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉంది. మండల వ్యాప్తంగా 10 సచివాలయాలు ఉండగా 95 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయ ఉద్యోగాల పట్ల అవహేళనగా మాట్లాడారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కయ్యారు. గతంలో ఒకటవ తేదీన వలంటీర్లు అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు సూర్యోదయం కాకముందే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందించే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచి పోవడంతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. చాలా వరకు సచివాలయ ఉద్యోగులు సైతం సెలవులపై వెళ్లారు.

తప్పని అవస్థలు

మండల కేంద్రంలోని ఎస్.పీ.కుంట–1 సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తించే డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉండటంతో ఆధార్ సేవలు అందక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పనులు జరగక పోవడంతో అసహనంతో వెనుదిరుగుతున్నారు.

ఆధార్ కోసం అగచాట్లు



నాకు ముగ్గురు మనవరాళ్లు. వాళ్లకు ఆధార్ అప్డేట్ చేయించడం కోసం నాలుగు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. కానీ ఆ అధికారి లేకపోవడంతో పని జరగడం లేదు. ఎక్కడికి వెళితే పని జరుగుతుందో చెప్పే వాళ్లు కూడా ఆఫీసులో లేరు.

– కరుణాకర్‌రెడ్డి, గోవిందరాజులపల్లి

సచివాలయ సేవలు అందడం లేదు



గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్ద పొందేవాళ్లం. ప్రస్తుతం ఏ పథకం అందడం లేదు. విద్యార్థులకు ఆధార్ అప్డేట్ చేయించాలన్నా కష్టంగా మారింది. సచివాలయ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందేలా చూడాలి.

– అంజియాదవ్, వెలిచలమల

ఎంఈఓకు సన్మానం

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎంఈఓగా పని చేస్తున్న కిరణ్మయి ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం ఉపాధ్యాయులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు ఎంఈఓ సేవలను కొనియాడారు. అనంతరం ఆమెను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమణప్ప, గోపాల్ నాయక్, చాముండేశ్వరి, ఉపాధ్యాయులు పకృద్దీన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్ శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం కింద దాదాపు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక సంఘం నిధులతో అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వార్డుల అభివృద్ధికి కౌన్సిలర్లు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, సీఐ నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తనకల్లు: చిన్నపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తనకల్లు ఎక్సైజ్ సీఐ మారుతిరావు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన చెంచుగారి చింతలప్ప అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లను తీసుకొచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అతన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సునంద, ఎస్ఐ జిలానీ, హెచ్‌సీ రామచంద్ర, కానిస్టేబుళ్లు మారుతి, అయ్యప్ప పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం

ఓడీచెరువు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ పేర్కొన్నారు. అల్లాపల్లి సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతాచారి మాట్లాడుతూ వివిధ శాఖల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా 30 మంది అర్జీలు అందించినట్లు తెలిపారు.

గాండ్లపెంట: స్థానిక గ్రామ సచివాలయంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై 4 వినతులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ బాబురావు తెలిపారు. వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించండి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓడీచెరువు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా మహాసభల సన్నాహాల్లో భాగంగా మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సిఫారసులకు అనుగుణంగా విద్యుత్ ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఎన్నికల వాగ్దానానికి విరుద్ధంగా 44 శాతం విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బడా సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ కిష్టప్ప, జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వక్తలు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీఈఓ కిష్టప్ప, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు ఎంతో ఆశతో తెచ్చుకున్న నూతన ప్రభుత్వం ఉద్యోగుల కోర్కెలను మన్నించి పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. బకాయి పడ్డ డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ మొత్తాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న కదిరి పట్టణంలో నిర్వహించే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రామంజనేయులు, హరికృష్ణ, సాయిగణేష్, హింది పండిట్ వేణుగోపాల్, శ్రీనివాసులు, పీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో నవ సమాజ నిర్మాణం


ఎన్‌పీకుంట: మాట్లాడుతున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

ఎన్‌పీకుంట: అక్షరాస్యతతో నవ సమాజ నిర్మాణం సాధ్యమని ఎంఈఓ గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వయోజన విద్య సూపర్‌వైజర్ సుధాకర్ అధ్యక్షతన 'ఉల్లాస్' కార్యక్రమంపై విద్యా వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షరాస్యతతో నాగరికత, ఆత్మవిశ్వాసం పొందించుకోవచ్చన్నారు. మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించడానికి ఉల్లాస్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలు ఈ కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ ఆంజినమ్మ, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏపీఎం వెంకటనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, క్లస్టర్ సీసీలు, వీఓఏలు, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో వయోజన విద్యపై డ్వాక్రా మహిళలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారికి చదవడం, రాయడం, అంకెలపై రిసోర్స్‌పర్సన్ నాయుడు అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆర్డీటీ నిధుల గోల్‌మాల్

గాండ్లపెంట: ఆర్డీటీ అకౌంటెంట్ నాగరాజు సంస్థ నిధులు రూ.20, 71800 గోల్‌మాల్ చేశాడు. ఏఎస్ఐ రంగా తెలిపిన మేరకు.. స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో మహిళలకు వృత్తిశిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. కేంద్రంలో బుక్‌బైండింగ్, అంగరబత్తులు, ఫినాయిల్ తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు కావాల్సిన ముడిసరకును విజయవాడ జోగులాంబ ట్రేడర్స్ నుంచి ఆర్డర్ బుక్ చేసి తెప్పించే వారు. ఈ క్రమంలో అకౌంటెంట్ జోగులాంబ ట్రేడర్స్ యజమాని సూర్యతేజతో కుమ్మక్కై ముడిసరకులు ఆర్డర్ పెట్టకుండానే పెట్టినట్లు చెక్కులు చూపించి ముడిసరుకులు వచ్చినట్లు మహిళలను నమ్మించాడు. ఈ ఏడాది జూన్‌లో ఆర్డర్ ఇచ్చినా ఇంత వరకు ముడి సరుకులు రాలేదని అడగ్గా వచ్చినట్లు బుకాయించాడు. అయితే మహిళలకు అనుమానం రావడంతో విషయాన్ని సంస్థ వారికి తెలియజేశారు. ముడి సరుకులు రాలేదని నిర్ధారించుకున్న శిక్షణ కేంద్రం సిబ్బంది పద్మావతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


చిగిచెర్ల వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏలు సనావుల్లా, కృష్ణయ్య

ధర్మవరం రూరల్: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని డీఆర్సీ ఏడీఏ సనావుల్లా, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య రైతులకు సూచించారు. శుక్రవారం చిగిచెర్లలో రైతు రాఘవరెడ్డి సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. కంది పంటకు కాయతొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించి నివారణ కోసం స్పైనోసాడ్ 60 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదం, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆముదంలో బూజు తెగులు నివారణకు ప్రాపికోనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వరిలో దోమపోటు నివారణకు పెక్సీలాన్ 94 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏఓలు ముస్తఫా, అబ్దుల్ అలీ, వీహెచ్ఏ భార్గవ్, ఏఈఓ లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


మాట్లాడుతున్న హార్టీకల్చర్ అధికారి లావణ్య

తనకల్లు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ వైపీ కౌసల్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రతినిధుల లెవనెత్తే సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం సీజీ ప్రాజెక్టు నిండిందని, అయితే కాలువలు పూడిపోవడంతో నీరు అందక ఆయకట్టు భూములన్నీ బీడుగా ఉన్నట్లు సర్పంచ్ సురేష్‌రెడ్డి తెలిపారు. ఇరిగేషన్ అధికారులు కాలువ పూడికతీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారన్నారు. గ్రామాల్లో పశువుల నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ హేమావతి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎర్రబల్లిలో 25 మంది విద్యార్థులున్నా అక్కడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మూసివేశారని, దీంతో విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలోని కందుకూరు పాఠశాలకు రోజూ నడుచుకొని వెళ్లి వస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఎంఈఓ కళ్యాణి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంపీడీఓ రెడ్డెప్ప మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. వైస్ ఎంపీపీ రమణమ్మ, ఏఓ శ్రీహరినాయక్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్, హార్టీకల్చర్ లావణ్య, ఏపీఓ మరియమ్మ, హౌసింగ్ ఏఈ విజయభాస్కర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమకు చేయూతనిద్దాం


ఆప్కో షోరూం ప్రారంభిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేత పరిశ్రమకు చేయూతనిద్దామని బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖామంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని చిత్రావతి రోడ్డులో జౌళి శాఖ ఆధ్వర్యంలో ఆప్కో షోరూంను మంత్రి స్థానిక ఎమ్మెల్యే సింధూరారెడ్డితో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన షోరూంలు ఏర్పాటు చేస్తోందన్నారు. చేనేత రంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉద్యోగులు వారంలో ఒక్క రోజు చేనేత వస్త్రాలు ధరించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. ధర్మవరం పట్టుచీరలు, పొందూరు ఖద్దరు, కలంకారి చీరలు, తదితర వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. ఆప్కో ద్వారా ఆన్‌లైన్ కూడా అమ్మకాలు అందుబాటులో ఉంటాయని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆప్కో వైస్ చైర్మన్ పావనమూర్తి, జనరల్ మేనేజర్ నాగేశ్వరావ్, ఏడా రామకృష్ణ, డివిజనల్ మార్కెటింగ్ అధికారి మధుబాబు, సేల్స్ మేనేజర్ వాణి, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుక్కపట్నం చెరువులో ఏర్పాటు చేసిన సాయి ఆక్వా బోటింగ్‌ను మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు.

సంక్షిప్త సమాచారం

బాధితులకు పరామర్శ

తలుపుల : అనారోగ్యంతో బాధపడుతున్న పులిగుండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆంజనేయులును పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం జ్యోతివాండ్లపల్లి తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న తండా నాయక్ ఇంటికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ

గాండ్లపెంట: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదును పారదర్శకంగా చేపట్టాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈమేరకు ఏఈలు వెంకటేష్‌నాయక్, నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పక్కాగా నమోదు చేయండి

తాడిమర్రి: పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారుల అనారోగ్య వివరాలను పక్కాగా నమోదు చేయాలని తాడిమర్రి వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత, రేచీకటి, విటమిన్ల లోపం, పోషకాహార లోపాలను గుర్తించి నమోదు చేయాలన్నారు. పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో గిరిజనులకు అవకాశం కల్పించాలి

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లిఖార్జుననాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా గిరిజనలు అన్నిరకాలు వెనుకబడ్డారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు.

11న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

కదిరి టౌన్: ఈనెల 11న కదిరిలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెవి.రమణ, కార్యదర్శి వెంకటేశులు శుక్రవారం తెలిపారు. వడ్డెర్లు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కోనాపురంలో వైద్య శిబిరం

కనగానపల్లి: కోనాపురంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విష జ్వరాలు, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ మనోహర్ బాబు, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వర్ పని చేయక ఇబ్బందులు

అమడగూరు: డోర్ టు డోర్ సర్వే చేస్తున్న అధికారులకు సర్వర్ పని చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులంతా సర్వే కోసం గ్రామాలకు వెళ్లారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకూ అధికారులంతా గ్రామాల్లోనే పడిగాపులు కాచినా సర్వర్ పని చేయలేదు. ఓ వైపు ప్రభుత్వం నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆన్‌లైన్ యాప్‌ను అప్‌డేట్ చేసి సర్వర్ పని చేసేలా చూడాలని అధికారులంతా కోరుతున్నారు.

కనగానపల్లి ఎస్ఐగా మహమ్మద్ రిజ్వాన్



కనగానపల్లి: కనగానపల్లి నూతన ఎస్ఐగా ఎస్.మహమ్మద్ రిజ్వాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఇషాక్ బాషా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కర్నూలు జిల్లా కౌతాలం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మహమ్మద్ రిజ్వాన్‌ను ఇక్కడికి బదిలీ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాధారంగా స్వాగతం పలికారు.